## క్లుప్తంగా

### వెంకన్న నిజరూప దర్శనంతో భక్తుల పులకింత



పెందుర్తి: వెంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 11వ రోజు గురువారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువ జామున హారతి, సేవాకాలం, శాత్తుమొరై, తిరుప్పావై, పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి చేశారు. 11వ పాశురం వినిపించారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

### సింహగిరికి భక్తుల తాకిడి



ప్రసాద విక్రయశాల వద్ద భక్తుల రద్దీ

సింహాచలం: సింహగిరికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విజయవాడ దుర్గాదేవిని దర్శించుకునేందుకు చండీకి వెళ్లిన ఉత్తరాంధ్ర జిల్లాల్లోని దీక్షాధారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల కిటకిటలాడాయి.

### ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రాములు మాస్టారు

సబ్బవరం: సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన రొంగలి రాములు మాస్టారు రూ.60,116 విరాళంతో పాటు ఆలయంలో కంచు గంట ఏర్పాటు నిమిత్తం మరో రూ.18 వేలు అందజేశారు. నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఈ విరాళం మొత్తాన్ని ఆయన వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. విరాళం అందజేసిన రాములు మాస్టారుకి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి ప్రకాష్, గెడ్డం కృష్ణ, ముర్రి కనకరాజు, పెన్నం శ్రీనివాసరావు, కొల్లి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ శత వార్షికోత్సవాలు ప్రారంభం



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: సీపీఐ శత వార్షికోత్సవాలను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు ఆధ్వర్యంలో సుజాతానగర్, వేపగుంట, నాయుడుతోట, పెందుర్తి, గిరిప్రసాద్‌నగర్-1, 2 కాలనీల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల పార్టీ తరఫున ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా సీపీఐ ఎల్లప్పుడూ నిలబడుతుందన్నారు. పార్టీ పెద్దలు చూపిన బాటలో రానున్న రోజుల్లో నడుస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు అసిరినాయుడు, ప్రకాష్, త్రినాథ్, అన్నపూర్ణ, అరుణ, రాము, రమణ, దుర్గారావు, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.







పంచగ్రామాల్లో ఇళ్ల రిపేర్ల కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ ప్రభుత్వం తీసుకోని సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. భూసమస్య కోర్టులో ఉన్నా.. నివాసితుల బాధలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక మెమో జారీ చేసి ఇళ్ల రిపేర్లు చేసుకునే వీలు కల్పించింది. దరఖాస్తుల జారీ దగ్గర నుంచి అనుమతులు ఇచ్చే వరకు అంతా పారదర్శకంగా జరగడంతో పలువురు నివాసితులు ఇళ్ల మరమ్మతులు చేసుకున్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసిన మెమోనే ఇటీవల కూటమి ప్రభుత్వం కూడా జారీ చేసింది. కానీ దరఖాస్తుల జారీ, స్వీకరణ ప్రక్రియల నుంచే పారదర్శకత కొరవడినట్లు విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

- పంచగ్రామాల ఇళ్ల మరమ్మతులకు కూటమి అరకొర చర్యలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంతా పారదర్శకం
- రిపేర్లకు అనుమతుల కోసం నివాసితుల ఎదురుచూపు

# పంచ గ్రామాలపై వంచన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పంచగ్రామాల భూ సమస్య రెండున్నర దశాబ్దాలకు పైగా ఉంది. సుమారు ఇరవై ఏళ్ల కిందట సమస్య కోర్టు పరిధిలోకి వెళ్లడంతో శాశ్వత పరిష్కారానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నించింది. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని తీసుకొచ్చేందుకు తీవ్రంగా కృషిచేసింది. దాంతో పాటు శిథిలావస్థలో ఉన్న ఇళ్లకు ఎంతో మేలు చేసింది. భూ సమస్య కారణంగా దేవస్థానం దాడులతో ఇళ్లు రిపేర్లు కూడా చేసుకోలేని పరిస్థితికి అడ్డుకట్ట వేసింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉపయోగపడేలా నిర్ణయం తీసుకున్నారు. పంచగ్రామాల్లో ఇళ్లు రిపేర్లు చేసుకునేందుకు 2023 నవంబరు 14న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక మెమో జారీ చేసింది.

**పనులు ముందుకు..**

ప్రభుత్వం మెమో జారీ చేయడంతో పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు అనుమతి ఇచ్చేందుకు దరఖాస్తులు ఏ తేదీ నుంచి స్వీకరిస్తామో దేవస్థానం అధికారులు పత్రికాముఖంగా ముందుగా పేర్కొన్నారు. సింహాచలంలోని దేవస్థానానికి చెందిన శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి స్వయంగా దరఖాస్తులు అందజేశారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. పూర్తి చేసిన దరఖాస్తులను మాత్రం స్వయంగా తీసుకున్నారు. కలెక్టర్, సింహాచలం దేవస్థానం ఈవో ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటైంది. సింహాచలం దేవస్థానం నుంచి ఒక అధికారి, రెవెన్యూ ఉప తహసీల్దార్, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అధికారి కమిటీగా ఏర్పడ్డారు. వారు వచ్చిన దరఖాస్తులు సరైనవో కావో పరిశీలన అనంతరం పర్మిషన్లు జారీ చేశారు. దాదాపు 500 మంది వరకు దరఖాస్తు చేసుకోగా 200 మందికి ఈ ఏడాది ఫిబ్రవరిలో అధికారికంగా అనుమతి పత్రాలను అప్పటి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్, సింహాచలం దేవస్థానం ఈవో సమక్షంలో అందజేశారు. మిగిలిన దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ మరుగున పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మెమోని మళ్లీ పునరుద్ధరించాలని పలువురు కూటమి ఎమ్మెల్యేలే ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పట్లో తీసుకొచ్చిన మెమోని పొడిగిస్తూ ప్రస్తుత దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ ఈ ఏడాది నవంబర్ 1న మెమో జారీ చేశారు. దీంతో దేవస్థానం అధికారులు గడిచిన కొన్ని రోజుల నుంచి శ్రీదేవి కాంప్లెక్స్ వద్దే దరఖాస్తులు తీసుకుంటున్నారు.

**ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తులు..**

ఇదిలా ఉండగా గడచిన నవంబర్ 1న కమిషనర్ మెమో జారీ చేయడంతో ఎప్పటి నుంచి మళ్లీ దరఖాస్తులు జారీ చేస్తామో దేవస్థానం అధికారులు ముందుగా ప్రకటించలేదు. కేవలం ఆఫ్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు అందజేస్తున్నారు. అంతే కాకుండా దరఖాస్తులు పూర్తి చేసి తిరిగి ఇచ్చిన వారికి కనీసం రశీదు (ఎక్నాలెడ్జ్‌మెంట్) కూడా ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దరఖాస్తుల స్వీకరణ కోసం కంప్యూటర్లు కూడా ఏర్పాటు చేసి అందులో ఆ దరఖాస్తుల వివరాలను వెంటనే అప్‌లోడ్ చేశారు. ఆన్‌లైన్‌లో ఆయా దరఖాస్తుల స్టేటస్ కూడా నివాసితులు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. ఇవేవీ ప్రస్తుతం జరగటం లేదు. దరఖాస్తులు తీసుకున్న వారి ఫోన్ నంబరు, చిరునామా మాత్రమే పుస్తకంలో రాసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 170 మంది దరఖాస్తులు తీసుకోగా వంద మంది వరకు వాటిని పూరించి తిరిగి అధికారులకు అందజేశారు. వీరందరికీ దేవస్థానం ఎక్నాలెడ్జ్‌మెంట్లు అందజేయలేదు. అలాగే దరఖాస్తులు స్వీకరించే తుదిగడువు కూడా ప్రకటించలేదు. ఎప్పుడు కమిటీ వేసి, ఎప్పుడు మరమ్మతులకు పర్మిషన్ ఇస్తారో అని పలువురు ఎదురు చూస్తున్నారు. దీంతో పారదర్శకత లోపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కలెక్టర్‌కు నివేదించాం..**



ఇళ్ల మరమ్మతుల కోసం గతంలో ఉన్న పద్ధతులనే పాటిస్తాం. గతంలో వేసిన కమిటీలో అధికారులు బదిలీలపై వెళ్లిపోయారు. దీంతో కొత్త కమిటీ వేయాలని ఇటీవల కలెక్టర్‌కి రాశాం. కలెక్టర్ కొత్త కమిటీ వేసిన తర్వాత దరఖాస్తులను ఆ కమిటీలో ఉన్నవారికి అందజేస్తాం. కమిటీ పరిశీలించి రిపోర్టు ఇచ్చిన తర్వాత అనుమతులు అందజేస్తాం. ప్రస్తుతం అప్లికేషన్లు తీసుకుంటున్నాం. అప్లికేషన్లకి పక్కాగా నంబర్లు వేస్తున్నాం. త్వరలోనే కంప్యూటరైజ్ చేసి అప్లికేషన్లకి రశీదులు కూడా ఇస్తాం.

– వి.త్రినాథరావు, ఈవో, సింహాచలం దేవస్థానం

## అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 5 లక్షల విరాళం



అన్న ప్రసాద పథకానికి నిధులిచ్చిన దాతలకు బాండ్లు అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్, ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం రూ. 5 లక్షల విరాళాన్ని దాతలు అందజేశారు. నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన కాకర్లపూడి లక్ష్మీనరసింహరాజు లక్ష రూపాయలు, కాకర్లపూడి సుదర్శనమ్మ లక్ష రూపాయలు, గొట్టిముక్కల జగన్నాథరాజు లక్ష రూపాయలు, వానపల్లి సత్యానంద కృష్ణ రెండు లక్షలు నగదు రూపంలో సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు బాండ్లను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, ప్రోటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తవ్వితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: మండలంలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపునకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. సబ్బవరంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు జోరుగా సాగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించామన్నారు. ప్రధానంగా గంగవరం, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం, పైడివాడ, అసకపల్లి, ఎల్లుప్పి గ్రామాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గతంలో పట్టుబడిన వాహనాలకు నామమాత్రపు పెనాల్టీ విధించి విడిచిపెట్టడం జరిగేదన్నారు. ఇకపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపునకు వినియోగించే జేసీబీలు, లారీలు పట్టుబడితే సీజ్ చేసి కోర్టులో ప్రవేశపెడతాం అన్నారు. మండలంలో ఎక్కడా గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు అనుమతులు లేవన్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలను స్థానిక సీఐ, మైనింగ్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, మైనింగ్ ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మలుపు



పి.బోనంగి రహదారిలో ప్రమాదకరమైన మలుపు

- జాజులవానిపాలెం-పి.బోనంగి రహదారిలో రాకపోకలకు ఇబ్బందులు
- వెలగని వీధి దీపాలు

పరవాడ: జాజులవానిపాలెం-పి.బోనంగి రహదారిలో సంస్కృతి గ్లోబల్ పాఠశాల సమీపంలోని ప్రమాదకరమైన మలుపు ప్రయాణికులను భయపెడుతోంది. ఈ రెండు గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి ఇరుగ్గా ఉండడం, ఇక్కడి మలుపులోని కల్వర్టు శిథిలం కావడంతో ప్రజలు బితుకు బితుకుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా చీకటి పడితే ఈ రహదారిలో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంటుందని వాపోతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన వీధి దీపాలు మరమ్మతులతో మూలుగుతున్న కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిలో మలుపు వద్ద కనీసం వీధి లైటు ఏర్పాటు చేయని కారణంగా మలుపు తిరుగుతున్న సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు. ఇక్కడి కల్వర్టు కూడా శిథిలమయిందని చెబుతున్నారు. గతంలో ఈ మలుపులో జరిగిన ప్రమాదాల్లో అనేక మంది ప్రయాణికులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారని పలువురు వాపోతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి మలుపు వద్ద కల్వర్టును అభివృద్ధి చేయడంతో పాటు వీధి దీపాలకు రిపేర్లు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పూడ్చిన పంచాయతీ కాలువ పరిశీలన

పరవాడ: పరవాడ పంచాయతీలో జరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని స్థానిక వీఆర్వోకు పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ ఆదేశాలు జారీ చేశారు. పరవాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 137లో రియల్టర్ అక్రమంగా పూడ్చివేసిన పంచాయతీ కాలువ, ధ్వంసం చేసిన రక్షణ గోడలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు గురువారం పరిశీలించారు. ఆక్రమణలకు పాల్పడిన రియల్టర్‌ను పిలిపించి పూడ్చిన పంచాయతీ కాలువ, ధ్వంసం చేసిన రక్షణ గోడలను యథావిధిగా నిర్మించాలని అధికారులు ఆదేశించారు. అందుకు రియల్టర్ అంగీకరించారని గ్రామ వీఆర్వో సత్యనారాయణ చెప్పారు. ఆక్రమణలు జరిగిన స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి పట్నాయక్, సర్వే సిబ్బంది పరిశీలించారు.

## పెదగాడి రెవెన్యూ సదస్సుకు వినతుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌డీసీ సీతారామారావు, సదస్సుకు హాజరైన ప్రజలు

పెందుర్తి: మండలంలోని పెదగాడిలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు వినతులు హోరెత్తాయి. వివిధ అంశాలపై 111 వినతులు రాగా అందులో 56 ఎఫ్-లైన్ (సర్వే) కోసం, 49 మ్యుటేషన్ (పట్టాదారు పుస్తకాలు) కోసం రాగా.. గ్రామంలో జరుగుతున్న భూ ఆక్రమణలపై ఆరు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎన్‌హెచ్-16 ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సీతారామారావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర విచారణ చేసి పరిష్కారం చూపుతామని చెప్పారు. భూ ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి నిజంగా ఆక్రమణలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సర్పంచ్ కేసుబోయిన లావణ్య, మాజీ సర్పంచ్ బొడ్డు అప్పలరాజు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- గ్రామంలో సర్వే నంబర్ 70లో ఉన్న చెరువును కొందరు కబ్జా చేశారని, సర్వే నంబర్ 420లో చెరువు, సర్వే నంబర్ 253లోని కాలువ ఆక్రమణ, సర్వే నంబర్ 71, 72లలోని కాలువ ఆక్రమణలపై బొడ్డు అప్పలరాజు, గళ్ల అప్పలరాజు, నీటిపల్లి మహేష్, గళ్ళ అచ్చిబాబు తదితరులు ఫిర్యాదులు చేశారు.
- తన పేరిట పాస్ పుస్తకాలు, ఇతర రెవెన్యూ రికార్డులు ఉన్నా ఆన్‌లైన్‌లో తన పేరు చేర్చకుండా వేరే వాళ్లకు తన భూమిని ఇచ్చేందుకు స్థానిక వీఆర్వో ప్రయత్నం చేస్తున్నారని బుర్రి చిన్న అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు.
- తహసీల్దార్ ఆనంద్‌కుమార్ గ్రామంలోని రెవెన్యూ సదస్సుకు గైర్హాజరు కావడాన్ని స్థానిక కూటమి నాయకులు ఆక్షేపించారు. సదస్సు ప్రారంభంలో తహసీల్దార్ వచ్చే వరకు కార్యక్రమం ప్రారంభించవద్దని అధికారుల వద్ద పట్టుబట్టారు. ఎస్‌డీసీ కలుగజేసుకుని సర్దిచెప్పడంతో కార్యక్రమం ప్రారంభమైంది.
- తనకు ప్రోటోకాల్ ప్రకారం అధికారులు గౌరవం ఇవ్వలేదని స్థానిక సర్పంచ్ కేసుబోయిన లావణ్య ఆరోపించారు.

### సింహగిరిపై విశేషంగా శ్రీనృసింహ హోమం



శ్రీ నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### వీరబాలలకు ఘన నివాళి

పెందుర్తి: వీరబాల దివస్ సందర్భంగా వీరబాలలు జోరవావర్ సింగ్, ఫతేసింగ్‌ల వర్ధంతిని పాపయ్యరాజుపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించారు. వీరబాలలకు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## గోదాదేవికి విశేష పూజలు



బేడా మండపంలోని తిరువీధిలో గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువు దీరిన గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నప పఠనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఆశీనులను చేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించి విశేషంగా హారతి అందజేశారు.

**వెంకన్న ఆలయంలో:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం విశేషంగా పూజలు నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఆశీనులను చేసి పాశుర విన్నప పఠనాన్ని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. భక్తులు, మహిళలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని వేంకటేశ్వరస్వామిని, గోదాదేవిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర పూజలు



దేవీపురంలోని మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో మార్గశిర ఆఖరి గురువారాన్ని పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీమేరు ఎదురుగా ఉన్న హోమశాలలో జరిగిన మహాలక్ష్మి అమ్మవారి సహస్ర నామావళి హోమంలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి రోజు జరగాల్సిన వారాహి సహిత చండీ హోమం కూడా నిర్వహించారు. అదే విధంగా విశేష పూజల్లో పాల్గొన్న అమృత కన్యా గురుకులం విద్యార్థులు గురుమాత అన్నపూర్ణమ్మ దీవెనలు అందుకున్నారు.

### చి'వరి' గాయం..



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎన్నో ఒడిదుడుకులకు ఎదురొడ్డిన రైతులు పంటను నిలబెట్టుకున్నారు. రేయింబవళ్లు శ్రమించి కోత దశకు తెచ్చుకున్నారు. మరో వారం రోజుల్లో పంట కల్లాలకు చేరుతుందన్న క్రమంలో ఆఖర్లో వచ్చిన వాయుగుండం రైతులకు శాపమైంది. పక్వానికి వచ్చిన వరి చేనును కోసిన క్రమంలో ఒక్కసారిగా వచ్చిన వర్షాలు అన్నదాతలను నిలువునా ముంచేశాయి. దీంతో పొలంలో ఉన్న పంట పూర్తిగా తడిచిపోయింది. చాలాచోట్ల గింజలు మొలకెత్తాయి. అయినా పంటపై మమకారం చంపుకోలేని రైతులు తడిచిన వరి చేనును చిన్నపాటి కుప్పలుగా వేసి గింజలు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. – పెందుర్తి